# పేపర్లో పీవీ మావయ్య



"**చూశావా,** మీ పీవీ మావయ్య నిర్వాకం!"

"ఏం, ఇప్పుడేం వొచ్చిందేమిటి? కేసుల్లోంచి బయట పడుతున్నాడుగా, మళ్లీ ఏమైనా కొత్త కేసు పెట్టారా, పేపర్లో ఏవైనా వేసారేమిటి ఖర్మ?"

"వెయ్యక?! ఏం స్కాములు, ఏం స్కాములు! ఈయన ధర్మమాని ఏ పేపరు చూసినా తెలుగుపేర్లే. టీవీలో, రేడియోలో కూడా తెలుగు పేర్లన్నీ న్యూస్ రీడర్ల నోట్లో నలిగి, నలిగి నాశనమవుతున్నాయి."

"న్యూస్ రీడర్లకు సరిగ్గా చదవడం రాకపోతే అది మన తప్పా?"

"వాళ్లను మాత్రం ఏం అనగలం? ఇన్నాళ్లూ, స్కాములూ, స్కాండల్సూ అంటే ఏ యూపీ పేరో, బీహారీ పేరో అఘోరించేది. అవి పలికి, పలికి అలవాటు పడ్డారు వాళ్లు. ఇప్పుడు చేంతాడంత పేర్లతో తెలుగువాళ్లు తెరకెక్కేసరికి వాళ్లకి కొరుకుడు పడటం లేదు."

"పోన్లెండి, వాళ్ల అవస్థ వాళ్లు పడతారు గానీ, ముందు మీరా పేపరు పక్కనబెట్టి, కూరల కెళితే మంచిదేమో, నిన్న సాయంత్రమే తెచ్చిపడేయమంటే విన్నారు కాదు."

"పేపరు పక్కన బెట్టి వెళ్లడమేం? కూరల మార్కెట్టుకు చంకన పెట్టుకుని వెళ్లి అక్కడ అందరికీ చదివి వినిపిస్తాను. మీ మావయ్య అయితే నాకేం? బాబయ్య అయితే నాకేం?"

"నాకు మావయ్య అయితే మీకు బాబయ్య అవుతాడు. అది గుర్తుంచుకొని మాట్లాడండి."

"ఏం మావయ్యో, ఏమిటో! అన్ని కోట్లు తినేసేరంటున్నారు గదా, మనకీ ఓ కోటి పడేసి ఉండకూడదూ, హాయిగా ఉద్యోగం మానేసి నేనూ వ్యాపారం పెట్టేద్దును."

"బావుంది సంబడం. మనం మరీ అంత దగ్గరి బంధువులం కాదు కదా!"

"అదిగో, ఇప్పుడొస్తున్నావు దారికి. పీవీ గారు ప్రధాని అయిన దగ్గర్నుంచీ ప్రతీ తెలుగువాడూ ఆయన బంధువు ననడమే. నీకు మాత్రం? ఎక్కడో వేలు విడిచిన అత్తయ్య వియ్యపురాలి కూతురి ఆడపడుచు దత్తత తెచ్చుకున్న..."

"... చెప్పానుగా. బంధుత్వం కాస్త దూరమయినా ఆయన్ని మావయ్య అనడమే మా కలవాటు. మొన్న ఆయన మనవరాలి పెళ్లిలో మా అమ్మతో బాటు కనబడితే పలకరింపుగా చిరునవ్వు నవ్వేడు కూడా..."

"ఆయన నవ్వడం! అదీ నిన్ను చూసి!!"

"ఒట్టేయనా, చెప్పొద్దూ, నాకు ఆశ్చర్యం వేసింది, నన్నెలా గుర్తుపట్టాడా అని."

"ఆయన నవ్వడం నిజంగా నిజం అయితే నిన్ను చూసి జయలలిత ఫ్రెండు శశికళ అనుకుని పొరబడివుంటాడు."

"చాల్లెండి, వేళాకోళం. నేనంత లావుగా ఉన్నానా? ఏదో, కాస్త బొద్దుగా ఉంటానంతే. అయినా నా కన్ని నగలెక్కడివి? అత్తారింట్లో ఓ అచ్చటా, ముచ్చటా..."

"సర్లే, అవన్నీ పక్కకు బెట్టు. స్కాముల్లో పీవీగారు ఇరుక్కోగానే, ఆయన మాకు తెలీదంటే, మాకు తెలీదని అందరూ మొహం చాటేస్తున్నారు. ఇప్పుడు కొద్ది, కొద్దిగా బయటకు పడుతున్నా పరిస్థితి మెరుగుపడటం లేదు. దూరంగానే ఉంచుతున్నారు. దీంట్లోంచి బయటపడిన విధానం గురించి కొన్నాళ్లాగి మరో స్కాము బయటపడుతుందేమోనన్న భయమో, ఏమో. ఆయన నమ్మినవాళ్లందరూ మొహాలు చాటేసారు. కానీ, పాపం నువ్వు మాత్రం అప్పటినుంచి ఇప్పటిదాకా కాసబియాంకాలా అతి విశ్వాసపాత్రంగా ఇంకా 'మా మావయ్య' అంటున్నావు. అందుకు మెచ్చుకోవాలి. పాపం ఈ సంగతి ఆయనకు ఎవరైనా చెబితే బావుణ్ను. అసలు సదరు సావిత్రి అనే దూ...రూ...రూరపు చుట్టం ఉందని ఆయనకు తెలుసో లేదో..."

"సంతోషించాంలెండి, తెలివితేటలకు ! ఇంకోర్ని అనడం ఎందుకు? మీరు మాత్రం ఆయన పవర్లో ఉండగా 'చూసారాండీ మన తెలుగువాడి తెలివితేటలు, మైనారిటీ ప్రభుత్వాన్ని

ఎంత తెలివిగా లాక్కొస్తున్నాడో, నార్త్ ఇండియన్ వాళ్లందరూ దంగై పోతున్నారు' అంటూ మురిసిపోయారుగా. ఇప్పుడేం వచ్చింది?"

"అలా అడిగేవు బాగుంది. అప్పుడు వాళ్లందర్నీ ఆకట్టుకొన్న విధానం ఏమిటో ఇప్పుడు తెలిసివచ్చింది కాబట్టి..."

"ఇప్పుడు కొత్తగా ఏం తెలిసొచ్చిందట?"

"అందుకే మరి పేపరు చదవమన్నది, ఆ ఎంపీలను కొనడమేమిటో, పార్టీ చీల్చడమేమిటో తెలిసొస్తుంది."

"తెలిసి ఏం చేస్తానులెండి."

"ఏం చేస్తావా? కనీసం ఈ సారి ఆయన పార్టీకి ఓటెయ్యవు. అసలు నీలాటి వాళ్లందరికీ ఓటు హక్కివ్వడం ప్రభుత్వం చేసిన పెద్ద పొరబాటు."

"ఏం? మేం మాత్రం మనుషులం కామా?"

"మనుషులంటే కాళ్లు, చేతులు ఉండగానే సరిపోదు. బుర్ర ఉండాలి. ఇందిరమ్మ ఉన్నంతకాలం 'సాటి ఆడది' అంటూ ఆవిడ వాళ్లకి ఓటేసావు. ఎన్టీయార్ వచ్చి "ఆడపడుచులు' అంటే వాళ్లకేసావు. మొన్న 'మా బావ' అంటూ రాజేశ్వర్రావు కేసావు. ఒక్కసారి కూడా నే చెప్పిన వాడికి ఓటేయలేదు."

"మీరు వేసిన వాళ్లందరూ ఉద్ధరించేరా?'

"ఏదీ, ఒక్కడూ నెగ్గందే! దేశంలో నీలాటి గొర్రెలమంద జనాభాయే ఎక్కువ. నాలాటి మేధావుల ఘోష వినేవాడేడీ? అసలు ఈ డెమోక్రసీ అంటే నా కందుకే మంట. ప్రజాస్వామ్యం అంటే మూకస్వామ్యం, మందస్వామ్యం అన్నమాట."

"మరి పీవీ గారు కాంగ్రెసు పార్టీలో డెమోక్రసీ లేకుండా చేసాదని ఆయన్ని తిట్టిపోసారేం మీరు?"

"చూడు సావిత్రీ, మట్టిబుర్రలా మాట్లాడకు. నేనదేమిటంటే "పీవీగారు కాంగ్రెసు పార్టీలో ఎన్నికలు జరిపించలేదు, అంతా నామినేషన్లతో లాక్కొచ్చేసాడు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు" అని . దానికీ, దేశంలో ప్రజాస్వామ్యానికీ సంబంధం లేదు."

"అంటే ఆ ప్రజాస్వామ్యం అనేది ఆయన పార్టీలో ఉండాలి; దేశంలో ఉండకూడదు. అంతేగా?"

"తిరకాసు కబుర్లు కట్టిపెట్టు. ముందు కాఫీ తగలెయ్."

"కాఫీ నేను తగలేస్తాను. సిగరెట్టు మీరు తగలేద్దురుగాని. ఆ తర్వాతైనా పేపరు పక్కనబెట్టి కూరలు తెచ్చిపడేస్తారా? లేదా?"

"తెస్తాను లేవయ్యా. పేపరు చదవనీ అసలు నీకు పేపరంటే అంత మంట ఎందుకు? ఇవాళ్టి పేపరు చదువుతూంటే తిట్టుకుంటావు. పోనీ అని చదవకుండా దాచిపెడితే 'పాతపేపర్లతో కొంపంతా నింపేసార'ని తిట్టిపోస్తావు. నీకూ పేపరు వాళ్లకీ క్రితం జన్మలో వైరం ఏమైనా ఉందా? రోజూ టీవీ మానేసి కాస్సేపు పేపరు చదువు. పక్కింటి అచ్చమ్మ, బుచ్చమ్మ కబుర్లు పోగేయడమైనా తగ్గుతుంది."

"పేపరు చదవకపోతే కొంపేం మునిగిపోతుంది లెండి. అయినా తెలుగు పేపరు తెప్పించమంటే తెప్పించరు..."

"ఎందుకు? 'గృహిణి మానభంగం' 'శివార్లలో దోపిడీ' వంటి వార్తలు చదువుదామనా?

నువ్వు ఇంగ్లీషు ఇంప్రూవ్ చేసుకోవాలనే కదా ఇంగ్లీషు పేపరు తెప్పిస్తూంట."

"నేనిప్పుడు ఇంగ్లీషు మాట్లాడి ఎవర్ని ఉద్ధరించాని కనక? పోనీ మీరేమైనా ఆఫీసు పార్టీలకీ వాటికి తీసుకెళతారేమో ననుకుంటే "అబ్బే, వద్దు, అవి 'వెట్' పార్టీలు' అంటారు మీరు."

"అదిగో ఏ విషయం మాట్లాడినా నా సిగరెట్లలోకి, మందులోకి దింపేస్తావు. అసలు నేను చెప్పేదేమిటంటే పీవీ గారు రాజ్యం చేసిన రోజుల్లో సాధించిన దేమిట్రా అంటే వాడి పిలక వీడికి ముడేయటం, వీడి గోచీ మరోడి చేత లాగించడం. ఇవన్నీ గొప్ప పనులా?"

"మరి వీటికే అప్పుడాయన్ని అపర చాణక్యుడని మీరు మెచ్చుకొనేవారు!?"

"బావుంది. పేపర్లో అలా రాసేరు..."

"...మరి ఇప్పుడేమయిందో?"

"ఇప్పుడు అసలు విషయం రాస్తున్నారు."

"అప్పుడెందుకు రాయలేదో?"

"రాయద్దని అప్పుడు ఒత్తిడి చేసారేమో..."

"ఇలా రాయమని ఇప్పుడు ఒత్తిడి చేస్తున్నారేమో. ఇదే అసలో, అదే అసలో ఎవరు చూడొచ్చారు లెండి. అయినా ఆయన మీద కేసులు కొట్టేస్తున్నారుగా. మళ్లీ దానికి ఏదో కథ చెప్పకండి. నిజానిజాలు మీరెళ్లి మీ కళ్లతో చూడొచ్చారు కనకనా.."

"అబ్బబ్బ సావిత్రీ, నువ్వు తిక్కతిక్కగా మాట్లాడుతావేమిటి? ఏదో అనెడ్యుకేటెడ్ లేడీస్ - పిడకలొత్తుకునే పిచ్చమ్మో, పుల్లలేరుకొనే పుల్లమ్మో అందంటే అర్థం ఉంది కానీ, కాస్తో, కూస్తో చచ్చో, పుచ్చో చదివిన నువ్వు ఇలా అడ్డదిడ్డంగా వాదిస్తావేం?..."

"...చచ్చో, పుచ్చో ఏం ఖర్మ? శుబ్భరంగా ఎస్సెల్సీ చదివేను."

"అవునవును. మీ నాన్నగారు ప్రతీ మేష్టారింటికి పళ్లబుట్టలు పంపించి పాస్ చేయిస్తే..."

"ఏమండోయ్, మీ ఊళ్లో ఎస్సెల్సీ పరీక్ష స్కూల్లోనే ఉంటుందేమో కానీ, మాకు మాత్రం పబ్లిక్ ఎగ్జామ్‌లెండి."

"సంతోషించాం తెలివితేటలకి. అందుకే అరడజను సార్లు వెళ్లాల్సి వచ్చింది పరీక్షకు..."

"ఎన్నిసార్లు వెళ్తేనేం? పాసయ్యేనా లేదా? అది చూడండి."

"ఆఖరుసారి మీ నాన్నగారికి తెలిసున్న వాచర్లు వచ్చి ఉంటారులే."

"అదిగో, అదే పాడుబుద్ధి ఈ మగాళ్లకి. ఇంట్లో పెళ్లానికి తెలివితేటలున్నాయని ఛస్తే ఒప్పుకోరు. అదే ఏ నళినీ సింగు లాటిదో లిపుస్టిక్కు పూసుకొచ్చి కళ్లూ చేతులూ తెగ తిప్పుకుంటూ టీవీలో చెప్పేసరికి అది చెప్పిందంతా నిజమని నమ్మేస్తారు."

"చూడూ, అంత బుర్ర తక్కువ వాళ్లెవరూ లేరిక్కడ. ఏది చెప్పినా ఒకటికి నాలుగు పేపర్లు చదివి 'క్రాస్ చెక్' చేసుకుని చూస్తాను. యూరియా కుంభకోణమే తీసుకో.."

"అది మావయ్యకి తెలిసే జరిగిందని ఎలా చెప్పగలరు?"

"నీకు ఏదీ తట్టదు. చెబితే వినవు. మూర్ఖంగా వాదిస్తావు. పీ.ఎమ్. ఇన్వాల్వ్‌మెంట్ లేకపోతే చెంచాడు యూరియా కూడా చేతికి రాకుండా కోట్ల రూపాయలు ఎందుకు చెల్లించారంటావ్?"

"అలా చెల్లించినా కొంతకాలం పాటు దాన్ని ఎవరూ తీసుకోలేదటగా. ఎందుకంటారు?"

"ఏమో మరి, పేపర్లో రాయలేదు..."

"ఇది తెలుసుకోడానికీ, పేపరు చదవడానికీ సంబంధం ఏమిటండీ? అసలు పేపరు చదవక్కర్లేదు - కామన్‌సెన్స్ ఉంటే"

"అంటే? అంటే నీ ఉద్దేశంలో పేపరు చదివే వాళ్లకు కామన్ సెన్స్ ఉండదనా? అంటే నాకు లేదనా?"

"ఏమోనండి, నాకు తెలీదు. చచ్చుపుచ్చు చదువులు చదివిన దానిని."

"అంతే, ఆ మాట అక్షరాలా నిజం. పెద్ద అతి తెలివిగా మాట్లాడుతున్నా ననుకుంటున్నావు కదూ! మీ మావయ్య గురించి మిడిసి పడుతున్నావు కదా, చూస్తూండు. పీవీ గారు కూచోబెట్టిన కేసరే పట్టుబట్టి ఆయన్ని జైలుకి పంపమని గుజ్రాల్ మీద ఒత్తిడి తెస్తాడు. 'మా మావయ్య, మా మావయ్య' అంటూ గెంతులేస్తున్నావు కదూ. ఆయన జైలుకెళ్లడం ఖాయం. ఊచలు లెక్కపెట్టడం ఖచ్చితం. ఆయన బహుభాషావేత్త కదూ. 'ఏక్, దో, తీన్... ఒకటి, రెండు మూడు... ఒన్ను, రెండు, ...నా తలకాయ' - అన్ని భాషల్లో లెక్కపెట్టమను... కూరలు తేవాలిట, కూరలు... వెళ్లి మీ మావయ్య నడుగు. స్వర్గంలో నున్న లక్ష్మీభాయికి చెప్పి ఊరగాయలు పంపిస్తాడు. ఆ ఆవకాయేసుకుని కంచం నిండా భోజనం చెయ్యి" కోపంతో ఊగిపోతున్నాడు రాజా.

"పాపం, ముసలాయన, మా మావయ్య నొక్కణ్ని చేసి ఇంతమందీ కలిసి కాల్చుకుని తింటూ..." ఏడుపు తన్నుకు రావడంతో సావిత్రి ఇక మాట్లాడలేకపోయింది...

(వార్త ఆదివారం సెప్టెంబరు 97)

